గిట్టుబాటు ధర లేక గిరిజనుల వెతలు

ప్రజాశక్తి- పెదబయలురూరల్ :పెదబయలు వారపు సంతలో గిరిజనులు పండించిన రాజ్‌మా చిక్కులు, కాఫీ గింజలు, ఔషద గుణాలు కలిగిన పిప్పల మోడీ వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక గిరిజనులు వాపోయారు.గతవారం పిప్పల మోడీ ధర రూ.350 ఉండగా, ఈ వారం రూ.300లకు పడిపోయింది. రెండో రకం (మోడీ) నలక గత వారం రూ.75 ఉండగా ఈ వారం రూ.45, కాఫీ రూ.280 నుంచి 270లకు కొనుగోలు చేశారు. దళారీ వ్యాపారులు ఇష్టారాజ్యంతో గిట్టుబాటు ధరలు లభించలేదని, కనీస ధరలు కల్పించాలని గిరిజనులు ఆవేదన వక్తం చేశారు.

సంతకు తీసుకొచ్చిన గిరిజన ఉత్పత్తులు

బోసిపోయిన పాడేరు

▶▶ సంక్రాంతికి స్వగ్రామాలకు తరలి వెళ్లిన జనం ▶▶ సెలవులతో నిర్మానుష్యంగా కార్యాలయాలు

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో రహదారులపై ట్రాఫిక్ తగ్గింది. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు వాహనాల మోతతో దద్దరిల్లే రహదారులు బోసిపోయి కనిపించాయి. లాక్ డౌన్ పెట్టినట్టుగా పలు ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి సెలవులకు ప్రజానీకమంతా స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో పట్టణం నిర్మానుస్యమైంది. మూడు రోజులపాటు సంక్రాంతి పండగకు సెలవులు కావడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. దీంతో పాటు అంతకు రెండు రోజుల ముందుగానే పాఠశాలలకు సెలవు దినాలు ప్రకటించడంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారి స్వగ్రామాలకు పయనమయ్యారు. జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో నివాసం ఉండే ఉద్యోగులు, వ్యాపారస్తులు, ఇతర కుటుంబీకులు ఎక్కువగా వేరువేరు ప్రాంతాల నుంచి స్థిరపడిన వారే ఎక్కువ. ఏజెన్సీలోని ప్రధానంగా ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లోని ఉద్యోగులు ఎక్కువగా జిల్లా కేంద్రంలో స్థిర నివాసం ఏర్పపర్చుకున్నారు. ఐటిడిఎ, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇతర శాఖల్లో పని చేసే ఉద్యోగులంతా ఎక్కువ మైదాన ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. సంక్రాంతి సందర్భంగా శని, ఆది, సోమవారాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రభుత్వం ప్రకటించడంతో వీరంతా వారి స్వస్థలాలకు వెళ్లారు. నిత్యం వందలాది మంది ఉద్యోగులతో, వ్యక్తిగత పనులతో వచ్చి పోయే ప్రజలతో కళగా కనిపించే ఐటిడిఎ, జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయాయి. ప్రధాన వీధుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నివాసం ఉండే వారంతా సొంత ఊళ్లకు వెళ్లారు. దీంతో జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణం నిర్మాణస్యమవడంతో వాహనాల రద్దీ, జనసంచారం తగ్గింది.

నిర్మానుష్యంగా ఐటిడిఎ కార్యాలయం

బోసి పోయిన కలెక్టరేట్

పండగ పూట పస్తులుంచడం భావ్యమా?

రేషన్ బియ్యం పంపిణీలో జాప్యంపై సిపిఎం ఆగ్రహం

మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారామయ్య

ప్రజాశక్తి- కూనవరం : క్రిస్మస్, సంక్రాంతి కానుకలకు మంగళం పాడేసిన ప్రభుత్వం, ప్రతినెలా ఇస్తున్న రేషన్ బియ్యాన్ని కూడా సంక్రాంతి పండుగకు ముందు ఇవ్వకపోవడం దారుణమని మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. ఏజెన్సీలోని నిరుపేద గిరిజనుల్లో అనేకమందికి రేషన్ బియ్యమే ఆధారంగా ఉంటోందని, అటువంటి పరిస్థితుల్లో ఈనెల15లో చౌకధరల దుకాణాల ద్వారా ఇంటింటికి ఇవ్వవలసిన రేషన్ బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు ఇవ్వకపోవడం దుర్మార్గమని విమర్శించారు. పండుగకు ముందు రేషన్ ఇవ్వకపోవడం ద్వారా అనేక పేదల గిరిజనులను ప్రభుత్వం పస్తులుంచాలను కుంటోందా అని ప్రశ్నించారు. సంక్రాంతికి రేషన్‌కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన కానుక ఇదేనా అని వాపోయారు. తక్షణమే రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో తలగాని నాగరాజ,ఆవుల మురళి, కుంజా రాధ, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు

మంచు దుప్పటిలో మన్యం

సీలేరు ప్రధానరోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -సీలేరు: మూడు రోజుల నుంచి సీలేరు పరిసర ప్రాంతాలతో పాటు నది పరివాహక ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తుండలతో చలి తీవ్రత అధికమైంది. జీకే వీధి మండలం సీలేరు, మెయిన్ డ్యామ్, నది పరివాహక ప్రాంతంలో మంచు తీవ్రత అధికంగా ఉండడంతో చలి తీవ్రత అధికమైంది. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం సుమారు 8 గంటల వరకు స్థానిక బజారు, ఎపి జెన్‌కో కాలనీలోవివపరీతమైన మంచుకురిసింది. సాయంత్రం ఆరు గంటలలోపే చల్లని గాలులు వీస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం చలి తగ్గుముఖం పట్టినట్టు పట్టి, సంక్రాంతి ముందు నుంచి చలి తీవ్రత మరింత అధికమైంది. ఇదిలా ఉంటే సీలేరు పరిసర ప్రాంతాల్లో మంచు అందాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సీలేరు మెయిన్ డాం నది తీరంలో మంచు పడుతుండడంతో ప్రకతి సోయగారు నడుమ మంచు అందాలు వివిధ రూపాల్లో పలువరను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో మంచు అధిక శాతం కురుస్తుండడంతో సమీప అటవీ ప్రాంతంలో ఉన్న పచ్చని చెట్లు ఆకులు పైనుంచి మంచు బిందువులు జాలువారుతున్న అపురూప దశ్యాలు పలువురిని అబ్బురు పరుస్తున్నాయి.

అధికారులు స్పందించకుంటే..

ఉద్యమం మరింత ఉధృతం

▶▶ ప్రజా సంఘాల వేదిక నాయకులు ▶▶ 29వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు:ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 29వ రోజు కొనసాగాయి. సంక్రాంతి పండుగ రోజుల్లో సైతం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు రాధాకృష్ణ, ప్రభుదాస్ మాట్లాడుతూ, అధికారులు కనీసం స్పందించకుండా ఇప్పటివరకు ఆశ్రమ పాఠశాలలో మెడికల్ క్యాంపులు, విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ చేయలేదన్నారు. విద్యార్థుల మరణాల నియంత్రణకు తీరికలేని పరిస్థితుల్లో జిల్లాస్థాయి అధికారులు ఉన్నారని విమర్శించారు. గిరిజనులు, గిరిజన విద్యార్థుల పట్ల అధికారులు ఎంత ప్రేమగా ఉన్నారో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. గిరిజన విద్యార్థులు చనిపోతే తమకెందుకులే అనే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాము చేస్తున్న పోరాటానికి జిల్లాస్థాయి అధికారులు స్పందించకపోతే ఉద్యమం ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్ ఆశ్రమాల్లో నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని, ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, పాడేరు ఐటీడీఏ పిఓ ను తక్షణమే సరెండర్ చేయాలన్నారు. ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను గిరిజన విద్యా సంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాడేరు ఐటి డి ఎ పిఓను సరెండర్ చేసేంతవరకు ఉద్యమం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక నాయకులు మువ్వల లక్ష్మణరావు, చిన్నారావు, బత్తిరి నరేష్, మణి పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ప్రజా సంఘాల నాయకులు

పండగను ఆచరిస్తున్న పెద్దలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:గడచిన కరోనా విలయ తాండవంతో అంతంతమాత్రంగా జరిగిన పెద్ద పండుగ సంక్రాంతి కోవిడ్ భయాల్ని దాటి ఈ ఏడాది పూర్తిస్థాయిలో జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమగా మూడు రోజులపాటు పండుగను అల్లూరి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఏజెన్సీలోని గ్రామాల్లో మూడు రోజులు సంక్రాంతి సంబరాలు సందడిగా సాగాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజలు సొంతూళ్లకు చేరు కోవడంతో జిల్లాలోని గిరిజన గ్రామాలు పండుగ శోభతో కళకళలాడాయి. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో సహపంక్తి భోజనాలు, ముచ్చట్లతో జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ చిన్న పెద్దా ఉల్లాసంగా గడిపారు. గ్రామాల్లో థింసా నృత్యాలతో (గుమ్మలాట) ఆనందంగా గడిపారు. సంక్రాంతి సంబరాల కోసం తరలి వచ్చిన ప్రజానికంతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. సంక్రాంతి పండుగకు ముగ్గులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండడంతో మహిళలు తమ ఇళ్ల ముందు రోజుకో ముగ్గును వేస్తూ ముంగిళ్లను అందంగా అలంకరించారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా రావడంతో ఆనందోత్సవాల మధ్య వేడుకలను జరుపుకున్నారు.

'భారీ విజయం' పేరుతో ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలో గిరిజన సంస్కతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలతో సంక్రాంతి సంబరాలు వినూత్నంగా సాగుతుంటాయి. మైదాన ప్రాంతాల్లో సంక్రాంతిని పురస్కరించుకొని వీధివీధిన తీర్థాలు నిర్వహిస్తుంటారు. ఏజెన్సీలో అందుకు భిన్నంగా భారీ విజయం పేరుతో గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఊరంతా సంక్రాంతిని తలపించే రీతిలో పిల్లల నుంచి యువకులు, మహిళలు, పెద్దల వరకు విచిత్ర వేషధారణలతో అందర్నీ సంతోషంగా ఉల్లాస పరిచే రీతిలో ఈ భారీ విజయం ఉత్సవాలు జరుగుతుంటాయి. అన్నదమ్ములు, బావమరుదులు ఒక వైపునా, అక్క చెల్లెలు, వదిన మరదళ్ళు మరోవైపున బడ్డు లాగుతూ బలాబలాలను ప్రదర్శిస్తూ ఉల్లాసంగా భారీ విజయాన్ని జరుపుతుంటారు. ఈ భారీ విజయం రానున్న వారం రోజుల పాటు అనేక గ్రామాల్లో గిరిజనులు తన సాంప్రదాయంగా సంక్రాంతిని పురస్కరించి జరుపుకుంటుంటారు. వృద్ధులు సైతం విచిత్ర వేషధారణలతో ప్రదర్శనలు ఇస్తుంటారు. మహిళలు, యువకులు థింసా నృత్యాలతో ఉల్లాసంగా ఆడి పాడి ఆనందతాండవం చేస్తుంటారు. ఈ నృత్య ప్రదర్శనలు, పిల్లల వేషాలు అమితంగా ఆకట్టుకుంటాయి. పాడేరు సమీపంలోని లింగాపుట్టు, డోకులూరు, మినుములూరు, పాత పాడేరు, తామరపల్లి, డంపరాయి తదితర ప్రాంతాల్లో ఈ భారీ విజయం ఉత్సవాలు పెద్ద ఎత్తును నిర్వహిస్తారు.

విచిత్ర వేషధారణలో చిన్నారులు

మహిళా వైద్యాధికారి చొరవతో

గిరిజన గర్భిణికి పునర్జన్మ

తల్లీబిడ్డ క్షేమం .. ప్రశంసలు కురిపిస్తున్న మన్యవాసులు

ప్రజాశక్తి -సీలేరు: రక్తపోటుతో బాధపడుతున్న నిండు గర్భిణీ సుఖ ప్రసవానికి ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు తీసుకున్న శ్రద్ధ, చొరవపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు పునర్జన్మ ఇచ్చిందా అన్నట్లు సేవలందంచి, తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండేలా అవసరమైన వైద్యసేవలు అందించడంలో డాక్టర్ హిమబిందు సేవలపై మన్యవాసులు అభినందనలు కురిపిస్తున్నారు. ప్రాణభిక్ష పెట్టారంటూ కొనియాడారు. వివరాల్లోకి వెళితే... జీకే వీధి మండలం దారకొండ పిహెచ్‌సి చింతగుప్ప గ్రామంలో ఈనెల 11న వైద్యాధికారిణి హిమబిందు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిగతులపై ఆరా తీసే క్రమంలో నెలల నిండి, రేపేమాపో ప్రసవం అన్నట్లున్న గర్భిణి గొల్లూరు కుమారిని గుర్తించారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి, అధికరక్తపోటు ఉండడంతో సురక్షిత ప్రసవానికి ఆసుపత్రిలో చేర్పించాలని కుటుంబసభ్యులకు సూచించారు. అదేరోజు తన వెంట పిహెచ్‌సికి తీసుకొచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం అంబులెన్సులో చింతపల్లి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.అయితే మరుసటి రోజున, 12న, గర్భిణి కుమారి చింతపల్లి ఏరియా ఆసుపత్రి నుంచి ఎవరికి చెప్పకుండా తమ ఇంటికి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న డాక్టర్ హిమబిందు ఈనెల 13న ఎఎన్ఎం, మత్స్యకొండ, సచివాలయ మహిళా పోలీసులను గర్భిణికి ఇంటికి పంపించి, మళ్లీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. గర్భిణి పరిస్థితి క్రిటికల్‌గా ఉండడంతో ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఆశాకార్యకర్త సీతమ్మ సాయంతో ధారకొండ నుంచి చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చి గైనకాలజిస్ట్ ఆదిత్య, కీర్తికి చూపించారు, అక్కడి నుంచి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆసుపత్రిలో చేర్పించాలన్న అక్కడి వైద్యుల సూచనల మేరకు చేర్పించి డాక్టర్ హిమబిందు ధారకొండ వెళ్లిపోయారు.

అయితే నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేసి, ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. కెజిహెచ్‌లో చేరిన తర్వాత గర్భిణి కుమారి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. బాలింత కుమారి బిపి అదుపులోకి రాకపోవడంతో వారం రోజులపాటు ఆసుపత్రిలో ఉండాలని కెజిహెచ్ వైద్యులు సూచించారు.అక్కడ కూడా బాలింతగా ఆరోగ్యం విషమంగా ఉన్న కుమారి తాను ఇంటికి వెళ్ళి పోతానని మారాం చేయడంతో ఆశాకార్యకర్త సీతమ్మ మళ్లీ డాక్టర్ హిమబిందుకు సమాచారమిచ్చారు. వెంటనే కెజిహెచ్ చేరుకున్న డాక్టర్ హిమబిందు బాలింతకుమారి, శిశువును పరామర్శించి, రిపోర్టుల పరిశీలించారు. ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడే వరకు మరొక ఐదు రోజులు కేజిహెచ్‌లో ఉండాలని బాలింతరాలు కుమారిని డాక్టర్ హిమబిందు ఒప్పించారు. డాక్టర్ హిమబిందు ఇంతగా చొరవ తీసుకోకుంటే బాలింత కుమారి, ఆమె బిడ్డ దక్కేవారు కాదని స్థానికులు అంటున్నారు. ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు కృషి, చొరవను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారిగా విధుల్లో చేరిన అనతికాలంలోనే మారు మూల గ్రామాల్లో సైతం వైద్యశిబిరాలను నిర్వహిస్తూ, గిరిజనానికిమెరుగైన వైద్యం అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ఆమె తీసుకుంటున్న చొరవ అభినందనీయమని అంటున్నారు.

బాలింత రిపోర్టులు పరిశీలిస్తున్న డాక్టర్ హిమబిందు

ఆచారబద్దంగా సంక్రాంతి, కనుమ

గోవుకు పూజలు చేస్తున్న ఉపాధ్యాయ దంపతులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పలివాడ, తదితరపంచాయతీల్లో ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా సాంప్రదాయబద్ధంగా జరుపకున్నారు. భక్తిశ్రద్ధలతో ఇంటింటా పూజా కార్యక్రమాలు జరుపుకున్నారు. సాహజసిద్ధమైన పిండివంటలు తయారుచేసి బంధుమిత్రులతో కలిసి భుజించి వేడుక చేసుకున్నారు. ప్రతి ఇంటి ముంగిట్లో మహిళలు రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు పెట్టి పలువురికి సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకున్నారు .

గోమాతను పూజిస్తున్న ఉపాధ్యాయులు భగీరథ దంపతులు

సంక్రాంతి, కనుమ రోజు గోమాతకు ప్రత్యేక పూజలు చేస్తే అంతకు మించిన దైవమే లేదని గ్రామీణ ప్రాంతవాసుల్లో విశ్వాసం. అందుకు తగ్గట్టు భగీరథ ఉపాధ్యాయ దంపతులు గోమాతకు స ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతకు నుదుట, వీపుపై బొట్లు పెట్టి, నూతన వస్త్రాలు సమర్పించి, గోవుకు పాదపూజ చేశారు. తమ కుటుంబానికి భోగ భాగ్యాలు కలగాలని వేడుకొన్నారు.అలాగే పలుగ్రామాల్లో కనుమ పండుగ సందర్భంగా పూజలు చేశారు.

కుంట కేంద్రంగా కోడిపందేల జోరు..

రూ.లక్షల్లో బెట్టింగ్ ..నాలుగు రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్లు

ప్రజాశక్తి.- చింతూరు : చింతూరు డివిజన్ సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్, సుక్మా జిల్లా కుంట బ్లాక్ కేంద్రంలో అక్కడి అధికారుల కనుసన్నల్లో కోడిపందేలు, బెట్టింగ్, జూదం జోరు భారీగా కొనసాగింది. ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా పందెంరాయుళ్లు ఈపోటీల్లో పాల్గొన్నారు. రూ.లక్షల్లో బెట్టింగ్ రూపంలో చేతులు మారాయి.ఇదే సమయంలో విచ్చలవిడిగా నాటుసారా, పేకాట, గుండాట వంటి జూదాలు కూడా జోరుగాసాగాయి. కోడి పందేల నిర్వాహకులు రూ.లక్షల్లో అర్జిస్తున్నారు. ఆటోలు, కార్లు, మోటార్ సైకిళ్లపై జనానా భారీగా ఈ కోడిపందేల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు. జాతీయ రహదారి 30 పక్కనే యథేచ్ఛగా, బాహాటంగా కోడిపందేలు నిర్వహించినా ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధిగానీ కనీస చర్యలు చేపట్టలేదు. దీనికోసం వారికి భారీగానే ముడుపులు ముట్టాయని విమర్శలు వినిపిస్తున్నాయి

మహిళల ఫిర్యాదుతో రేఖపల్లిలో నిలిచిన పందేలు

పండుగ సందర్భంగా ఈ ప్రాంతంలో యథేచ్ఛగా సాగే కోడిపందేలు, జూదం అరికట్టాలని విఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన మహిళలు జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేయడంతో పోలీసుల చర్యలతో ఇక్కడ నిలిచిపోయాయి. ఏటా రేఖపల్లిలో కోడిపందేలు, జూదం ద్వారా కోట్లలోనే బెట్టింగ్‌లు జరుగుతున్నాయని, దీంతో అనేక పేదకుటుంబాలకు చెందిన వ్యక్తులు ఈ బెట్టింగ్‌ల్లో పాల్గొనడం ద్వారా ఆర్థికంగా కుదేలై, దాని ప్రభావం వారి జీవనం పడుతోందనిఫిర్యాదు చేశారు. ఆంధ్రలోని రేఖపల్లిలో కోడిపందేలకు అడ్డుకట్ట పడడంతో, ఇక్కడినుంచి పందెంరాయుళ్లు సరిహద్దు ఆవల ఛత్తీస్‌గఢ్ కుంటలో జరిగే పోటీల వద్దకు భారీగా తరలివెళ్లారు.

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో కుంటలో బాహాటంగానే సాగుతున్న కోడిపందేలు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలోని రాజవొమ్మంగి, దూసరపాము, జడ్డంగి గ్రామాల్లో పలువురు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు విజేతలకు ఒడుగుల జ్యోతి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, దూసరపాము సర్పంచ్ చీడిశివ, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు టీజీ నరేంద్రప్రసాద్, ఎస్‌కె షరీఫ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు ఘనజాల తాతారావ్, గ్రామస్తులు అధికారి సత్యనారాయణ, కె రాజు, మంతెన ముసలయ్య, వి గంగాధర్, వల్లి, ఎస్ రవి, ఎ.రవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గిరిజన దంపతుల దారుణహత్య?

మంత్రగాళ్ల నెపంతో హతమార్చి ఉంటారని అనుమానం

ప్రజాశక్తి -చింతూరు. : మండలంలోని స్టాపర్‌పేట గిరిజన గ్రామంలో ఆదివారం రాత్రి మంత్రగాళ్ల నెపంతో గిరిజన దంపతులను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఘటన స్థలాన్ని చింతూరు ఎస్ఐ యాదగిరి సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చింతూరు పోలీసుల కథనం ప్రకారం హత్యకు గురైన గిరిజన దంపతులు మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో హతమార్చి ఉంటారని భావిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం గ్రామ శివారున ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి, వివరాలివి. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కోటం మోహిత్ అనే యువకుడు రాజవొమ్మంగి నుండి కొండపల్లి బైకుపై వెళ్తుండగా సూరంపాలెం గ్రామశివారు ప్రాంతంలో మోటర్‌బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈప్రమాదంలో మోహిత్‌కు మొహం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి, అటుగా వెళుతున్న వాహనదారులు విషయాన్ని గమనించి ప్రమాదానికి గురైన మోహిత్‌ను తమవాహనంలో రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీదుర్గ ప్రధమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వందే భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ప్రయాణికులు

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

తెలుగు రాష్ట్రాల మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదివారం రాత్రి విశాఖలో ఘన స్వాగతం లభించింది. ఈ రైలును వారణాసి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. హైదరాబాదు నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి రాత్రి 10.00 గంటలకు విశాఖ చేరుకుంది. ఈ ప్రారంభోత్సవ ప్రత్యేకతలను తెలియజేసేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు విశాఖపట్నం మీడియా బృందానికి సావనీర్ పాస్‌లను అందించి ప్రత్యేక రైలులో రాజమండ్రి వరకు తీసుకువెళ్లి అక్కడి నుంచి వందే భారత్ రైలులో విశాఖపట్నం తీసుకువచ్చారు. కేంద్రీయ విద్యాలయం, రైల్వే స్కూల్ చెందిన 350 మంది విద్యార్థులను కూడా ఈ రైలులో తొలి రోజు ప్రయాణించే అవకాశం కల్పించారు. గంటకు 140 కిలోమీటర్ల సగటు వేగంతో ప్రయాణిస్తూ అతి తక్కువ సమయంలో విశాఖపట్నం చేరుకుంది. రైలులో ఆటోమేటిక్ డోర్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు, ప్రతి సీటుకూ ప్రత్యేక ఛార్జింగ్ పాయింట్లు, బయో వాక్యూమ్ టాయిలెట్లు, ఎల్‌సిడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. మొదటి క్యాబిన్ ఉండే డ్రైవర్‌తో నేరుగా ప్రయాణికులు మాట్లాడేందుకు పుష్ టాక్ వ్యవస్థను పొందుపరిచారు. ప్రతి సీటుకు ఒక రీడింగ్ లైట్ కూడా ఏర్పాటుచేశారు.

ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే డిఆర్‌ఎం అనూప్ సత్పతి మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి రైళ్లు భవిష్యత్తులో మరిన్ని ప్రవేశపెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్/పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిఆర్‌ఎం బహుమతులు పంపిణీ చేశారు. రాజమండ్రి నుంచి విశాఖ వచ్చే వరకు అన్ని స్టేషన్లలోనూ ఈ నూతన రైలుకు ఘన స్వాగతం లభించింది.

వడ్లపూడి రైల్వే వంతెనకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి -గాజువాక

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ వడ్లపూడి రైల్వే గేటు వద్ద వంతెనకు మోక్షం కలగడంలేదు. ఈ వంతెన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే ఉంది తప్ప ఒక అడుగు ముందుకు పడలేదు. ఏడాది క్రితం విజయసాయిరెడ్డి స్వయంగా పరిశీలించి, వీలైనంత తొందరలో వడ్లపూడి రైల్వే బ్రిడ్జి వినియోగంలో తెస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ పూర్తి కాలేదు. వాస్తవానికి రైల్వే శాఖ వాటాగా వంతెనను పూర్తిగా నిర్మాణం చేపట్టారు. మిగతాది రాష్ట్ర పరిధిలో ఉంది. దీన్ని రోడ్లు భవనాల శాఖ పూర్తి చేయాల్సి ఉంది. అప్పట్లో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వంగానీ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గానీ ఈ వంతెనకు సంబంధించి ఒక పైసా కూడా కేటాయించలేదు. దీంతో రైల్వే అధికారులు నిర్మించిన వంతెన అసంపూర్తిగా ఉండిపోయింది. ఈ వంతెన నిర్మాణ కాకపోవడంతో 14 గ్రామాల ప్రజలు, ఉద్యోగస్తులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోనగర్‌లో పనిచేస్తున్న ఎక్కువ శాతం మంది కార్మికులు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం కూర్మన్నపాలెం నుంచి షీలానగర్ వరకు 11 సిగ్నల్ పాయింట్‌లో ఉండడం వల్ల ట్రాఫిక్ రద్దు ఎక్కువగా ఉంటుంది. సమయాభావం కలుగుతుండటంతో వైజాగ్ నుంచి వచ్చే స్టీల్ ప్లాంట్ ఉద్యోగస్తులు, అగనంపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, దువ్వాడ ఏరియాలో నివాసముంటున్న వారు విశాఖ వెళ్లేందుకు ఈ రహదానినే వినియోగిస్తున్నారు. ఇక్కడ గేటు గేటు పడితే అరగంట వరకు వేచి ఉండే పరిస్థితి దాపురిస్తోంది. ఉదయం, రాత్రి ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే ప్రతి ఒక్కరికీ ప్రయాణం సులభతరం అవుతుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆ దిశగా పనులు జరగకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి సమస్య

వడ్లపూడి రైల్వే వంతెన విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పనులు ప్రారంభించే అవకాశముంది.

తిప్పల నాగిరెడ్డి
ఎమ్మెల్యే గాజువాక

అధికారులతో చర్చించా...

వడ్లపూడి రైల్వే గేటు సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. రెండు రోజుల క్రితం విజయవాడలో పరిశ్రమల శాఖ అధికారులను కలిసి సమస్యను వివరించాను.

రఘు
ఐలా చైర్మన్

వినియోగంలోకి తేవాలి : సిఐటియు

వడ్లపూడి రైల్వే వంతెనను వినియోగం తేవాలని సిఐటియు నాయకులు ఎం.రాంబాబు కోరారు.. దీనిపై గతంలో సిపిఎం, సిఐటియు తరపున ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఏళ్లు గడుస్తున్నా పట్టని పాలకులు

దుకాణ సముదాయం.. హామీకే పరిమితం

అదిగో ఇదిగో అంటూ తాత్సారం

ఆరు నెలల క్రితం కూలుస్తున్న దుకాణ సముదాయం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -భీమునిపట్నం

పురపాలక సంఘంగా ఉన్న కాలంలో స్థానిక గంట స్తంభం సమీపంలో దాదాపు 20 దుకాణాలను నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరాయన్న కారణంతో సుమారు ఏడాది క్రితం దుకాణాల్లో ఉన్న వ్యాపారులను జివిఎంసి ఒకటో జోన్ అధికారులు ఖాళీ చేయించారు. సుమారు 6 నెలల క్రితం వాటిని కూల్చేశారు. ఆధునిక పద్ధతిలో దుకాణ సముదాయం నిర్మిస్తామంటూ ఇటీవల బదిలీపై అనకాపల్లి జోన్‌కు వెళ్ళిన జోనల్ కమిషనర్ వెంకటరమణ పలుమార్లు చెప్పిన విషయం విదితమే. శిథిలావస్థకు చేరిన దుకాణసముదాయాన్ని పరిశీలించిన అప్పటి జివిఎంసి కమిషనర్ లక్ష్మీ శ కూడా బహుళ సామాజిక దుకాణ సముదాయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు కూడా. అధికారుల హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రత్యామ్నాయం చూపకుండానే కూల్చేశారు

సుమారు 25-30 ఏళ్ల క్రితం పురపాలక సంఘం, వుడా సహకారంతో ఇక్కడ నిర్మించిన దుకాణ సముదాయం సుమారు 20 మంది చిరు వ్యాపారులకు ఉపాధి ఇచ్చేది.వివిధ వ్యాపారాలు చేసుకుని జీవించే వారు. తద్వారా అప్పటి పురపాలక సంఘానికి, ప్రస్తుత జివిఎంసికి కూడా ఆదాయం వచ్చేది. శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయం కూల్చివేతను స్వాగతించాల్సిందే. అదే సమయంలో ఆయా దుకాణాల్లో ఎంతోకాలంగా వివిధ దుకాణాలు నిర్వహించుకుని ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

త్వరగా దుకాణ సముదాయం నిర్మించాలి

త్వరగా దుకాణ సముదాయం నిర్మించాలి. తద్వారా అటు జివిఎంసికి అద్దెల రూపంలో ఆదాయం వస్తుంది. ఇటు చిరు వ్యాపారులకు ఉపాధి ఉంటుంది. జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు వీలైనంత త్వరగా అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు తయారు చేయాలి.

గంటా నూక రాజు
టిడిపి రాష్ట్ర కార్యదర్శి

పరిశీలించిన మీదట ప్రతిపాదనలు



కూల్చేసిన దుకాణ సముదాయం స్థలం పరిశీలించాక, ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు రూపొందించనున్నాం. వీలైనంత త్వరగా కొత్త దుకాణ సముదాయం నిర్మించేలా ప్రయత్నం చేస్తాం

బొద్దేపల్లి రాము
జోనల్ కమిషనర్
జివిఎంసి, ఒకటో జోన్
భీమునిపట్నం

చేదెక్కిన చెరుకు

★ గిట్టుబాటు కాని వైనం
★ పంటకు దూరమవుతున్న రైతులు

ప్రజాశక్తి- చోడవరం

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రధాన వ్యాపార పంటగా ఉన్న చెరుకు సాగుకు రైతులు దూరమవుతున్నారు. గతంలో గోవాడ, ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీల్లో ఏడాదికి సుమారు 11,50,000 టన్నులు చెరుకు క్రషింగ్ జరిగేది. ప్రస్తుతం గోవాడ మినహా మిగిలిన మూడు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఆయా ఫ్యాక్టరీలు పరిధిలో చెరుకు సాగు చేసే రైతులు గిట్టుబాటు కాకపోవడంతో పంటకు దూరమయ్యారు. గోవాడ కర్మాగారం పరిధిలో రైతులు గతంలో ఐదు లక్షల 50 వేల టన్నులు చెరుకు ఫ్యాక్టరీకి సరఫరా చేసేవారు. గత నాలుగైదు ఏళ్లలో ఆ సంఖ్య మూడు లక్షలకు పడిపోయింది. గత ఏడాది రెండు లక్షల 85 వేల టన్నులు క్రషింగ్ జరిగింది. ఈ ఏడాది రెండు లక్షల టన్నులు పూర్తయ్యే పరిస్థితి కనబడడంలేదు. ఫ్యాక్టరీ పరిధిలో పెద్దేరు, కోణం, కళ్యాణపులోవ, తారకరామ రిజర్వాయర్ల ద్వారా పుష్కలంగా నీరు అందుతున్నా చెరుకు సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపడం లేదు. ఎకరా చెరకు సాగుకు సుమారు రూ.60 వేలు ఖర్చు అవుతుంది. ఎకరాకు 20 నుండి 25 టన్నులు లోపు దిగుబడి వస్తోంది. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ టన్నుకు రూ.2500తో పాటు తర్వాత మరో రూ.200 ఇస్తున్నారు. అది కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్న పరిస్థితి దాపురించింది. సుమారుగా టన్నుకు రూ.3,500 చెల్లిస్తే తప్ప గిట్టుబాటు కాదని రైతులు, రైతు సంఘాల నాయకులు ఎప్పటినుండో చెబుతున్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పంచదార ఫ్యాక్టరీలను పట్టించుకోలేదని రైతులు అధిక సంఖ్యలో వైసిపికి ఓట్లు వేశారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం చెరుకు గిట్టుబాటు ధర అందించడంలో ఎటువంటి శ్రద్ధ చూపకపోవడంతో దిగాలు చెందిన రైతులు పంటకు స్వస్తి చెప్పి, అచ్యుతాపురం, పరవాడ ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు రోజు కూలీలుగా పనులకు వెళుతున్నారు.

బెల్లం ధర అంతే

దేశంలోనే రెండవ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న అనకాపల్లి బెల్లం మార్కెట్ దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరపై ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రోజుకు 30 నుండి 40 వేల దిమ్మలు దిగుమతయ్యే మార్కెట్లో ప్రస్తుతం కనీసం 5000 దిమ్మల కూడా రావడం గగనమవుతుంది. ఫ్యాక్టరీలు గిట్టుబాటు ధర అందించలేని తరుణంలో రైతులు బెల్లం తయారీ వైపు మొగ్గు చూపేవారు. బెల్లానికి కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో తయారీదారులు డీలపడ్డారు. బెల్లం మార్కెట్ నుండి కొనుగోలు చేసిన బెల్లం ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండేది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాలకు మహారాష్ట్ర, కర్ణాటక నుండి బెల్లం ఎగుమతి అవుతుండడంతో అనకాపల్లి మార్కెట్‌కు కొనుగోలుదారులు రావడం తగ్గడంతో లావాదేవీలు స్తంభించాయని వ్యాపారులు అంటున్నారు. సంక్రాంతి సీజన్ ముందు బెల్లం తయారీదారులు నాలుగు కాసులు కళ్ళు చూసేవారు.

బెల్లం తయారీలో మునగపాక, అనకాపల్లి, చోడవరం, బుచ్చయ్యపేట, మాడుగుల, చీడికాడ, రావికమతం మండలాలు ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ బెల్లం క్రషర్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం ఎక్కడా తయారీ కనబడలేదు. ఇదే వరవడి మరో రెండు మూడు ఏళ్లు కొనసాగితే పూర్తిగా చెరుకు సాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ప్రధాన వ్యాపార పంటగా ఉన్న చెరుకును గిట్టుబాటు ధర కల్పించి రైతులను మళ్లీ సాగు వైపు వెళ్లే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలని రైతుల కోరుతున్నారు.

మాడుగుల టిడిపిలో సమసిపోని గ్రూపులు

ప్రకటనలకే పరిమితమైన ఐక్యతారాగం - కేడర్‌లో అయోమయం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో గ్రూపుల గోల సమసిపోలేదు. పార్టీ నియోజకవర్గం పరశీలకులు లొడగల కృష్ణ సమక్షంలో తామంతా ఐక్యంగా పని చేస్తామని ముగ్గురు ముఖ్య నాయకులు ప్రకటించినా, ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. వీరి వైఖరి పైకి పొత్తులు... లోపల కత్తులు అన్నట్లుగానే ఉంది తప్ప, పార్టీ మనుగడ కోసం తమ విబేధాలను పక్కన పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నియోజకవర్గంలోని టిడిపి కేడర్‌లో అయోమయం నెలకొంది.

మాడుగుల నియోజకవర్గం టిడిపిలో ప్రస్తుత పార్టీ ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు కేంద్రాలుగా గ్రూపులున్నాయి. గ్రామస్థాయి వరకు ఈ మూడు గ్రూపులుగా పార్టీ కేడర్ విడిపోయి ఉంది. నియోజకవర్గంలో టిడిపికి మొదటి నుంచి బలం ఉన్నప్పటికీ గ్రూపులు, అసమ్మతి వల్లే గత రెండు పర్యాయాలు పార్టీ ఓడిపోయింది. గతంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మొత్తం కేడర్‌ను సమన్వయ పరిచి ఏకతాటిపై నడిపించడంలో విఫలమయ్యారని, దీంతో అసమ్మతి వర్గం ఏర్పడిందని, ఇది పార్టీకి నష్టం చేకూర్చుతుందని భావించిన అధిష్టానం ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించింది. ఆ స్థానంలో పివిజి.కుమార్‌ను నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించినా గ్రూపులు తగ్గలేదు.

ఈ నేపథ్యంలో కొంత కాలం క్రితం టిడిపి నియోజకవర్గం పరిశీలకులు లొడగల కృష్ణ జోక్యం చేసుకొని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ముగ్గురు నాయకులను ఆ వేదికలపైకి తీసుకొచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంలో కొంతమంది మండల నాయకులు నియోజకవర్గం ఇన్‌ఛార్జి కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మండల నాయకులను పట్టించుకోవడం లేదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ టికెట్ ఎవరికిచ్చినా పార్టీ గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పని చేస్తామని ఆ వేదికలపై లొడగల కృష్ణ సమక్షంలో ముగ్గురు నాయకులు ప్రకటించారు.

ఈ ప్రకటన మూడు నాళ్ల ముచ్చటే. నియోజకవర్గంలో ముఖ్య నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఒక రోజున ఒకచోట ఈ కార్యక్రమాన్ని రామానాయుడు చేపట్టగా, మరో చోట కుమార్ చేస్తూ పార్టీ కార్యకర్తలను విస్మయానికి గురి చేస్తున్నారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు కొద్ది మేరకు కలిసి ఈ కార్యక్రమం చేస్తున్నా, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాత్రం విడిగా తన అనుయాయులతో కలిసి నిర్వహిస్తున్నారు. కలిసి చేద్దామని ఇటీవల దేవరాపల్లి మండలంలో కుమార్ సూచించినప్పటికీ అందుకు రామానాయుడు నిరాకరించారు. కుమార్ మెతక వైఖరితో నాయకులను ఒక తాటిపైకి తీసుకురావడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మరో వైపు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ నిర్వహిస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇప్పటికైనా టిడిపి నాయకుల్లో ఐక్యత లేకపోతే వచ్చే ఎన్నికల్లో మాడుగుల నియోజవర్గంలో టిడిపి ఓటమి ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా మిగిలిన ఇద్దరూ గెలుపునకు కృషి చేస్తామని వారు చేసిన ప్రకటనను సైతం ప్రజలు నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ముగ్గురు నాయకులను తెలుగుదేశం పార్టీ అధినాయకులు పిలిపించి సఖ్యత తీసుకొస్తే తప్ప నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం రాదని ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణం

- ఖాళీ స్థలాల్లో సైతం పనులు జరుగుతున్నట్లు జియో ట్యాగింగ్
- ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు లేబర్ ఛార్జీలకు కూడా సరిపోని వైనం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలో జగనన్న కాలనీల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలని నిబంధన, పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ప్రభుత్వ లక్ష్యం ఘనంగానే ఉన్నా, దాని అమలు మాత్రం ఆమడ దూరంలో ఉంది. బుచ్చయ్యపేట మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో 2,233 మంది లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించారు. వీరికి 35 గ్రామపంచాయతీల్లో లేఅవుట్లను గుర్తించి ఒక్కొక్క లబ్ధిదారునికి ఒకటిన్నర సెంట్లు స్థలాన్ని కేటాయించారు. కానీ ప్రభుత్వం ఆశించిన మేర నిర్మాణాలు సాగటం లేదు. ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇస్తానని హామీ ఇవ్వడంతో చాలామంది లబ్ధిదారులు అందుకు ఆమోదం తెలిపారు. కాని ప్రభుత్వం ఆ నిర్ణయం నుండి వెనక్కి వెళ్లి, ఒక్కొక్క ఇంటికి లక్షా 80 వేల రూపాయలు చొప్పున మంజూరు చేస్తోంది. ఈ నగదు ఇంటి నిర్మాణానికి ఏమాత్రమూ సరిపోవటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక, సిమెంటు, ఇటుక, ఇనుము తదితర నిర్మాణ ముడి సరుకులు ధరల విపరీతంగా పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు తలకు మించిన భారంగా మారింది. దీంతో చాలామంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇస్తుంది రూ.1,80,000 కాగా, ఇంటి నిర్మాణానికి రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చేది రూ.1.80లక్షలు.. మేస్త్రీలకు ఇస్తుంది రూ.2లక్షలు

ప్రస్తుతం నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండడంతో తాపీ మేస్త్రులకు డిమాండ్ అధికంగా ఉంది. దీంతో రోజువారీ పనులకు తాపీ మేస్త్రీలు రావటం లేదని లబ్ధిదారులు అంటున్నారు. తాపీ మేస్త్రీలు ఒక్కో ఇంటికి రూ.2 లక్షల చొప్పున కాంట్రాక్ట్ నిర్ణయించుకొని ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. మేస్త్రీ, లేబర్ పనులకు కాంట్రాక్టర్ తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 తాపీ మేస్త్రీలకు కూడా సరిపోవటం లేదు.

కాలనీలో కానరాని సదుపాయాలు

జగనన్న కాలనీలో తాగునీరు, రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. కాని ఏ కాలనీలోనూ తాగునీటి సదుపాయం లేదు. లేఅవుట్లలో బోరు తీసి మోటార్ బిగించి విడిచిపెట్టారు. రోడ్లు, మిగతా సదుపాయాలు జాడ కాన రాలేదు.

6 గ్రామాల్లో లేఅవుట్ల రద్దు?

మండలంలోని 35 లేఅవుట్లలో ఆరు గ్రామాల్లో లే అవుట్లు రద్దు కానున్నాయి. గ్రామాలకు దూరంగా, నివాసయోగ్యానికి అవకాశం లేకుండా లేఅవుట్లు ఉండటంతో పాటు శ్మశానాలకు దగ్గరగా ఉన్నాయి. ఈ కారణాలతో ఐతంపూడి, పొట్టి దొరపాలెం, ఎల్‌బిపి అగ్రహారం, నీలకంఠాపురం, కరక గ్రామాల్లో మంజూరు చేసిన లేఅవట్లతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో ఈ లేఅవుట్లను రద్దు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

కాగితాల్లోనే నిర్మాణాలు?

మండలంలో జగనన్న కాలనీల ఇంటి నిర్మాణాలు కాగితాలకే పరిమితమయ్యాయి. లక్ష్యం నిర్మాణాల్లో కాకుండా కాగితాల్లోనే కనిపిస్తోంది.

పూర్తిగా నిర్మాణాలు ప్రారంభం కాని కందిపూడి లేఅవుట్

ఉన్నత స్థాయి అధికారులు లక్ష్యాలను నిర్ధేశించి నిర్మాణాలు చేపట్టాలని ఒత్తిడి తేవడంతో నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల స్థలాల్లో సైతం నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు జియో ట్యాగింగ్ చేసి కాగితాల్లో చూపిస్తున్నారు. మండలంలో 2,233 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 2,220 నిర్మాణాలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వెబ్ సైట్‌లో చూపిస్తోంది. వాస్తవానికి ఏ లేఅవుట్‌లోనూ పూర్తిస్థాయిలో నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మండలంలో 900 వరకు ఇళ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 50 శాతం కూడా పూర్తి కాలేదు. మండలంలోని దిబ్బిడి గ్రామంలో 62 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తే సుమారు 15 వరకు ఇళ్లు స్లాబులు పూర్తయ్యాయి. మరో 15 ఇళ్లు వివిధ దశల్లో పునాది, సన్‌సైడ్, స్లాబ్ లెవెల్ తదితర దశల్లో ఉన్నాయి. ఇంకా సగం ఇళ్లు నిర్మాణం ప్రారంభం కాలేదు. కండిపూడిలో 62 ఇళ్లు మంజూరు కాగా, కేవలం 10 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో ఒకటి స్లాబ్ అవగా, మిగిలిన 9 సన్‌సైడ్, పునాది లెవల్‌లో ఉన్నాయి. ఇంటి నిర్మాణాలు చేయకపోతే రద్దు చేస్తామని అధికారులు ఒత్తిడి తేవడంతో కొంతమంది పునాది పూర్తి చేసి చేతిలో డబ్బులు లేక నిర్మాణాలు ఆపేశారు. ఏది ఏమైనా ప్రభుత్వం ఇచ్చే నగదు ఇంటి నిర్మాణాలకు ఏమాత్రం సరిపోక జగనన్న కాలనీలో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగటం లేదు.